
సాక్షి
గుంటూరు
ఆదివారం । 11 । మే । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.40 అడుగుల వద్ద ఉంది. ఇది 137.5158 టీఎంసీలకు సమానం.



వైభవంగా బ్రహ్మోత్సవాలు

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానంలో శనివారం స్వామివారు కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

బ్రహ్మంగారి తిరునాళ్ల



రెంటచింతల: పశర్లపాడు గ్రామంలో శనివారం బ్రహ్మంగారి తిరునాళ్ల వేడుకలను వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కృష్ణమ్మకు గర్భశోకం

- మేట తొలగింపు పేరుతో పక్కా స్కెచ్
- గతంలోనూ ఇదే రీతిలో కోట్లు కొల్లగొట్టిన పచ్చ నేతలు
- మళ్లీ అధికారంలోకి వచ్చాక అదే తంతు
- కృష్ణమ్మ గర్భాన్ని కుళ్లబొడిచి ఇసుక తవ్వకాలు
- ఇప్పటికే అధికార రీచ్‌ల్లో యంత్రాలతో తవ్వకాలు, అధిక లోడింగ్
- నిలువరించలేక చేతులెత్తేసిన అధికార యంత్రాంగం
- ఇసుక మేట తొలగింపులోనైనా కనీసం నిబంధనలను పాటిస్తారా !

ఇసుక మేట.. కాసుల వేట



గతంలో పట్టాభూముల పేరుతో కొల్లిపర మండలంలో తవ్వేసిన నదీ గర్భం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఇసుక మేట...రూ.కోట్ల దోపిడీకి అందమైన పేరు. ఏనాడో కృష్ణా నదీ గర్భంలో కలిసిపోయిన భూములవి. అక్కడ పంటలు పండించేది లేదు. రూపాయి ఆదాయం వచ్చే అవకాశం అసలుండదు. తెలుగుదేశం పార్టీ 2014లో అధికారంలోకి వచ్చాక, ఆ పార్టీ నేతల కళ్లు ఆ భూములపై పడ్డాయి. ఎందుకూ పనికి రాని వాటిల్లో ఇసుక మేట పేరుతో కాసుల వేట సాగించవచ్చని యోచన చేశారు. పక్కా ప్రణాళికతో పావులు కదిపారు. రైతుల పేరుతో అనుమతులు చకచకా వచ్చాయి. నిబంధనలను తీసి గట్టునపెట్టారు. రూ.కోట్లు కొల్లగొట్టారు. ఇందులో అసలు రైతులకు దక్కింది నామమాత్రమే. మళ్లీ ఇప్పుడు అదే ఇసుకమేట పేరుతో దోపిడీకి తెరతీశారు.

ఇసుకాసురులకు వరప్రసాదం

తెనాలి నియోజకవర్గంలోని కృష్ణాతీరం లోని కొల్లిపర మండలం ఇసుకాసురులకు వరప్రసాదం. అధికారిక ఇసుక రీచ్‌లు ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు మరోలా ప్రణాళికలు రచిస్తారు. పేరు మాత్రమే ఉచితం. అన్నీ పక్కాగా, పకడ్బందీగా జరిగిపోతాయి. అధికార గణం ప్రేక్షకపాత్ర వహిస్తుంది. పత్రికల్లో వచ్చినపుడు హడావుడిగా అక్కడకు తనిఖీలకు వెళతారు. అప్పటికే గప్‌చుప్ మన్నట్టుగా అక్కడ అన్నీ సర్దేసుకుంటారు. మళ్లీ రెండురోజుల తర్వాత షరా మామూలే! సాక్షాత్తూ సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ బేఖాతరు చేస్తారు. యంత్రాలతో ఇసుక తవ్వటం, బారీ డంపర్లలో 45 టన్నుల వరకు అధిక లోడింగ్‌తో రవాణా చేస్తుండటం కొల్లూరు మండలంలోని రీచ్‌లో ఇప్పటికీ చూస్తూనే ఉన్నాం.

రేపో మాపో అనుమతులు

ఇక రేపో మాపో ఇసుక మేట తొలగింపునకు అనుమతులు వచ్చేస్తాయి. అక్కడ్నుంచి అసలు కథ మొదలవుతుంది. అనుమతులు పట్టా రైతు పేరిటే ఉంటాయి. అక్కడ ఇసుక తవ్వకాల నుంచి, అమ్మకాల వరకు అన్నీ అధికార పార్టీల నేతల దళారులే పర్యవేక్షిస్తారు. అనుమతి తీసుకున్న భూమిలోనే కాకుండా నదిలో సమీప ప్రాంతంలోనూ తవ్వుతారు. నిబంధనల ప్రకారం ఎకరాకు ఇన్ని క్యూబిక్ మీటర్ల చొప్పున మాత్రమే తవ్వాలని, అది కూడా ఇన్ని అడుగులకు లోతుకు మించి తవ్వరాదని స్పష్టంగా ఉంది. వాటిని ఏమాత్రం ఖాతరు చేయరు. నిలువెత్తు లోతులో యంత్రాలతో నదీ గర్భాన్ని కుళ్లబొడిచిన దాఖలాలు ఎన్నో!

తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు

అక్రమ తవ్వకాలపై పత్రికల్లో వచ్చినా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేయడం మినహా చర్యలు లేవు. మళ్లీ ఇప్పుడు ఇసుకమేట పేరుతో రైతులు అనుమతులకు దరఖాస్తు చేయటంతో ప్రజాభిప్రాయ సేకరణ కూడా పూర్తయింది. ఇక అనుమతులు లాంఛనమే ! ఇసుక తవ్వకాలు ఎలా జరుగుతాయో చూడాల్సి ఉంది. ఈసారైనా అధికారులు నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలు జరిగేలా చూస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది. 2014 నుంచి 2019 వరకూ ఎంతమందికి పట్టా భూముల్లో తవ్వారన్న విషయం మైనింగ్ అధికారుల వద్ద సమాచారం లేదని చెబుతున్నారు. ఫైల్ కనపడటం లేదని, వెతుకుతున్నామని చెప్పడం గమనార్హం.

ప్రభుత్వానికి దరఖాస్తులు



ఈనెల 6న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ

కొల్లిపర మండలంలో ఇటీవల వరకు మూడు రీచ్‌లు నడిచాయి. ప్రస్తుతం అధికారిక రీచ్‌లు లేవు. అధికార పార్టీ నేతలకు ఆదాయ వనరు తగ్గింది. దీంతో గతంలో అమలుచేసిన ఇసుకమేట ప్రణాళిక గుర్తుకొచ్చింది. వెంటనే అమల్లోకి తెచ్చేశారు. కొల్లిపర మండలంలోని బొమ్మువానిపాలెం గ్రామ పరిధిలో కృష్ణానదిలో కలిసిపోయిన భూముల్లో ఇసుక మేట తొలగింపునకు అనుమతులు కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తులు వెళ్లాయి. ఆ ప్రకారం 6,932 హెక్టార్లలో అంటే 17.33 ఎకరాల్లో 72,790 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకానికి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ఈనెల 6న బొమ్మువానిపాలెం వచ్చారు. అక్కడి గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. రైతుల భూముల్లో ఇసుకమేట తొలగించుకుంటామంటే ఇతరులు ఎలా అభ్యంతర పెడతారు? సమావేశం సజావుగా జరిగింది. ప్రజాభిప్రాయం సానుకూలంగా ఉందనుకుంటూ అధికారులు వెళ్లిపోయారు.

సచివాలయ ఉద్యోగిపై చర్యలు తీసుకోండి

రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



హౌసింగ్ కార్యాలయంలో బాధితులు

సాక్షి ఎఫెక్ట్

తెనాలి అర్బన్: పేదల ఇళ్ల నిర్మాణాల్లో చేతివాటం ప్రదర్శించిన తెనాలి 28వ వార్డు సచివాలయ ఎమినిటీ సెక్రటరీ నవీన్‌పై కేసు నమోదు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ డీఎస్పీ జనార్దనరావును ఆదేశించారు. సాక్షి దినపత్రికలో శనివారం 'గృహ యోగంలో అవినీతి పర్వం' శీర్షికన కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన మంత్రి డీఎస్పీ జనార్దనరావును, డీఈ రఫీని మున్సిపల్ కార్యాలయానికి పిలిపిచ్చారు. అవినీతికి పాల్పడిన ఉద్యోగిపై వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీనిపై జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్పందించారు. విచారణ జరిపి నివేదిక అందజేయాలని గృహ నిర్మాణశాఖ పీడీ ప్రసాద్‌ను ఆదేశించారు. బాధితులను పిలిపించి స్టేట్‌మెంట్‌లో రికార్డు చేయాలని ఈఈ భాస్కర్‌ను ఆదేశించారు. ఆయన శనివారం సాయంత్రం బాధితులను తెనాలిలోని గృహ నిర్మాణశాఖ కార్యాలయానికి పిలిపించి స్టేట్‌మెంట్లు రికార్డు చేయించారు. వీటిని పీడీకి అందజేయనున్నట్లు ఈఈ భాస్కర్ సాక్షికి తెలిపారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న కూడా 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఇమ్యూనిటీ సెక్రటరీ నవీన్‌కు ఆదేశాలు జరిచేశారు. ఇవ్వని పక్షంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు విధుల నుంచి తప్పించనున్నట్లు ఆయన ప్రకటించారు.

న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జిని కలిసిన ఉద్యోగుల సంఘం నేతలు



గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా పోర్టుఫోలియో జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్యను న్యాయశాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర, గుంటూరు నగర సంఘ కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. గుంటూరు జిల్లా కోర్టులో శనివారం జరిగిన జ్యుడీషియల్ ఆఫీసర్స్ వర్క్‌షాప్‌నకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య హాజరయ్యారు. న్యాయమూర్తిని కలసిన వారిలో న్యాయశాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు చంద్రశేఖర్, నగర అధ్యక్షుడు రాచకొండ శ్రీనివాసరావు, కార్యదర్శి సొర్రా బైరాగి, సంఘ సభ్యులు ఉన్నారు.

మల్లేశ్వరస్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు దంపతులు శనివారం పెదకాకానిలోని భ్రమరాంబ మల్లేశ్వరసామి ఆలయానికి విచ్చేశారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్, అర్చక స్వాములు, వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ మేళతాళాలతో సాదర స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన వారు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అర్చకస్వాములు, వేద పండితులు ఆశీర్వవచనం అందించారు. న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులను స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటం, ప్రసాదాలను డీసీ అందజేశారు.

నేడు రెడ్ల రామమందిరం పునఃనిర్మాణానికి శంకుస్థాపన

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి గ్రామంలో వేంచేసి ఉన్న రెడ్ల రామమందిరం పునః నిర్మాణ శంకుస్థాపన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.20 గంటలకు జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మదర్స్‌డే వేడుకలు



గుంటూరు రూరల్: తల్లి స్థానాన్ని ఎవ్వరూ భర్తీ చేయలేరని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కేపీఎస్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మదర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లులు ఆరోగ్యంగా ఉంటే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి తల్లి, గర్భిణి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకుని ఆరోగ్యకరమైన బిడ్డలకు జన్మనివ్వాలన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి పంచారు. కార్యక్రమంలో మోడల్ ఆఫీసర్ శ్రీవాణి, ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సీడీపీవో విజయనిర్మల, సూపర్‌వైజర్ వెంకటరత్నం, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు గర్భిణులు పాల్గొన్నారు.

రేపు త్రికోటేశ్వరస్వామికి లక్ష మల్లెల పూజ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి ఈనెల 12వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహించే లక్ష మల్లెల పూజకు వేలాదిగా భక్తులు హాజరై స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.చంద్రశేఖర రావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. దాతల సహకారంతో ప్రతి ఏడాది వైశాఖ పూర్ణమి రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

సు'భద్ర' డబ్బులు కట్టించారు

- ఇప్పటీ దాకా జరిగింది నాకు తెలియదు.. ఇకపై ఏ కార్యక్రమమైనా రశీదు పొందాల్సిందే : ఏసీ
- నాజ్ సెంటర్ ఆంజనేయస్వామి దేవస్థాన వ్యవహారంపై అంతర్గత సమావేశం



నాజ్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానం



ఆలయాల ఏసీ టి. సుభద్ర

సాక్షి ఎఫెక్ట్

పట్నంబజారు: "గత ఏడాది ఏం జరిగిందో నా తెలియదు.. దేవస్థానాల్లో ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు వ్యవహరిస్తే.. నేను చూస్తూ ఊరుకోను.. కచ్చితంగా ప్రతి స్వామి వారి కార్యక్రమానికి డబ్బులు చెల్లించి రశీదు తీసుకోవాల్సిందే " అంటూ గుంటూరు నగరంలోని లాలాపేటలో గల గ్రూప్ ఆలయాల అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) టి. సుభద్ర తేల్చి చెప్పారు. లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి నాజ్ సెంటర్‌లోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ అర్చకులు, సిబ్బంది, హనుమాన్ దీక్షా సమాజం సభ్యులతో అంతర్గత సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఆంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న అవకతవకలు, పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఆలయంలో హోమాలు, అనేక కార్యక్రమాలు జరుపుకుంటూ.. ఆలయ ఆదాయానికి గండి పడేలా కొంత మంది వ్యవహరిస్తున్న తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రతి ఏడాది హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలు, పూజలకు డబ్బులు చెల్లించకుండా వ్యవహరిస్తే.. చూస్తూ ఊరుకోబోమని వారికి సైతం ఘాటుగానే వివరించారనే తెలిసింది. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు లేనివిధంగా హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఐదు రోజు కార్యక్రమాల్లో భాగంగా పట్టాభిషేకం, కల్యాణ కార్యక్రమాల్లో కూర్చునే కొంత మంది దాతల్లో ఒక ముఖ్య దాత రూ. 50,116 తొలిసారిగా చెల్లించి రశీదు తీసుకున్నట్లు తెలుస్తోంది.

ముందే చెప్పిన "సాక్షి"...

నాజ్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానంలో ఎటువంటి రశీదులు లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారని కొద్ది రోజుల కిందట సాక్షి పలు కథనాలు ప్రచురించింది. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు ప్రతి అంశాన్ని కూలకషంగా అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

తెల్లారిన బతుకులు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీల దుర్మరణం
- తిమ్మరాజుపాలెం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం
- రోడ్డు క్రాస్ చేస్తూ అదుపుతప్పి బోల్తాపడ్డ గ్రానైట్ లారీ
- డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలు



తాళ్లూరి ప్రభుదాసు



పాలపర్తి శ్రీను (ఫైల్)



తమ్మలూరి సురేంద్రబాబు



సురేంద్రబాబు మృతదేహం

పర్చూరు(చినగంజాం): రాత్రి వేళ పనిచేస్తే అధిక కూలి వస్తుందని ఆశించారు...కానీ ఆ రాత్రే వారికి చివరి రాత్రి అవుతుందని అనుకోలేదు...లారీ రూపంలో ఎదురొచ్చిన మృత్యువు వారి ప్రాణాలను కబళించింది. గ్రానైట్ పలకల లోడుతో వెళుతున్న లారీపై కూర్చున్న ముగ్గురు కూలీలు వాటి కింద పడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం జాతీయ రహదారిపై శనివారం వేకువజామున జరిగింది. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్టూరులో గ్రానైట్ పలకల లోడుతో శనివారం వేకువజామున ఓ లారీ గుంటూరు బయలుదేరింది. గుంటూరు వెళ్లెందుకు డ్రైవర్ మస్తాన్‌వలి లారీని పర్చూరు వైపు మళ్లించాడు. తిమ్మరాజుపాలెం వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి సడెన్ బ్రేక్ వేయడంతో ఒక్కసారిగా బోల్తా కొట్టింది. లారీపై కూర్చొని ఉన్న ముగ్గురు కూలీలు గ్రానైట్ పలకల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన వారిలో మార్టూరుకు చెందిన పాలపర్తి శ్రీను (25), తాళ్లూరి ప్రభుదాసు (43), పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన తమ్మలూరి సురేంద్ర బాబు(28)గా గుర్తించారు. డ్రైవర్ మస్తాన్‌వలి, క్లీనర్ రమేష్‌లు స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, పర్చూరు ఎస్‌ఐ మాల్యాద్రి హుటాహుటిన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గ్రానైట్ పలకలను తొలగించి మృతదేహాలను వెలికి తీశారు. రెవెన్యూ అధికారులు సునీత, యార్లగడ్డ శ్రీనివాసరావు, విజయ్ ఆధ్వర్యంలో శవ పంచనామాల అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దృష్టి సారించారు.

అధిక గ్రానైట్ లోడు ప్రమాదానికి కారణం?

లారీలో అధిక గ్రానైట్ పలకల లోడు వేయడం ప్రమాదానికి కారణమై ఉంటుందని పలువురు భావిస్తున్నారు. సామర్థ్యానికి మించి గ్రానైట్ పలకల లోడు లారీలో ఉన్నట్లుగా సమాచారం. రోడ్డు క్రాస్ చేసే సమయంలో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో లారీ బోల్తా కొట్టిందని భావిస్తున్నారు.

పర్చూరు వైపు లారీ ఎందుకు మళ్లింది?

మార్టూరులో గ్రానైట్ పలకలను లోడు చేసుకున్న లారీ నేరుగా గుంటూరు వెళ్లాల్సి ఉండగా పర్చూరు వైపు ఎందుకు మళ్లించారనే దానిపై అనుమానం వ్యక్తమవుతున్నాయి. గ్రానైట్ లోడుకు సంబంధించి సరైన పత్రాలు ఉన్నాయా? లేవా? అనే అనుమానాలను పలువురు వ్యక్తపరుస్తున్నారు. దీనికి సంబంధించి పూర్తి సమాచారం పోలీసుల విచారణ అనంతరం బయటకు వచ్చే అవకాశం ఉంది.

ముగ్గురూ బంధువులే..

ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురూ బంధువులే. పాలపర్తి శ్రీను, మృతుడు సురేంద్రబాబులు బావ మరుదులు. సురేంద్రబాబు భార్య రాణి స్వయనా శ్రీను అక్క. శ్రీను, ప్రభుదాసు సమీప బంధువులే. ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురూ ఇలా సమీప బంధువులు కావడం గమనార్హం.

మృతులంతా పేదలే..

ప్రమాదంలో మృతి చెందిన వారంతా మార్టూరు, నూతలపాడు ఎస్సీ కాలనీకి చెందిన పేద కుటుంబాల వారు. రాత్రి వేళ గ్రానైట్ లోడు చేసేందుకు వెళితే అధిక కూలి గిట్టుబాటు అవుతుందని ఆశించి వెళ్లిన వారే. కాగా మార్టూరులో గ్రానైట్ లోడు ఎక్కించడం మరలా గుంటూరు వెళ్లి లోడును దించి రావడం వరకు వారే స్వయంగా ఉంటారు. రోడ్డు ప్రమాదంలో వారు మృతి చెందడంతో ఆయా గ్రామాల కాలనీల్లో తీవ్ర విషాదం నెలకొంది. కూలి కోసం వెళ్లి మృత్యుఒడిలోకి జారుకోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు. మార్టూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన తాళ్లూరి ప్రభుదాసు ముగ్గురు ఆడపిల్లల తండ్రి. అతడి భార్య మరియమ్మ కాగా, కుటుంబ బాధ్యత అంతా ప్రభుదాసుపైనే ఉంది. కూలి పని చేసి సంపాదిస్తేనే వారి కుటుంబం గడిచేది. కానీ ఆయన ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పాలపర్తి శ్రీను అదే కాలనీకి చెందిన వాడు కాగా అవివాహితుడు. అతని తండ్రి పేరయ్యతో కలిసి ఉంటున్నాడు. పర్చూరు మండలం నూతలపాడు ఎస్సీ కాలనీకి చెందిన తమ్మలూరి సురేంద్రబాబు తల్లిదండ్రులు చంద్రం, మేరీలు కాగా భార్య రాణి. ఆమె కూడా కూలి పనులకు వెళ్లి వస్తుంటుంది. వీరికి ఇద్దరు మగపిల్లలు కాగా వీరిద్దరు కూలి పనులకు వెళ్లి తీసుకొచ్చిన సంపాదనతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.



ప్రభుదాసు మృతదేహం

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లాలో 51 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 27,162 మంది విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: సోమవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా హాజరు కానున్న 27,162 మంది విద్యార్థులకు 51 పరీక్ష కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న ప్రథమ సంవత్సర పరీక్షలకు 23,279 మంది హాజరు కానున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలకు 3,883 మంది హాజరు కానున్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌ఐవో జీకే జుబేర్ తెలిపారు. పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి నియమ, నిబంధనలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రథమ సంవత్సర పరీక్షలు రాసిన వారిలో ఎక్కువ శాతం బెటర్‌మెంట్ రాయడంతో ద్వితీయ సంవత్సర విద్యార్థుల కంటే అధికంగా ఉన్నారు.

సైనికుల సహాయనిధికి రూ.5 లక్షల విరాళం

బాపట్ల ఎస్పీకి చెక్కు అందజేసిన చీరాలకు చెందిన ఎన్‌ఆర్‌ఐ



బాపట్లటౌన్: భారత సైనికుల సహాయనిధికి చీరాల పట్టణానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ రూ.5 లక్షల చెక్కును శనివారం ఎస్పీ తుషార్ డూడీకి అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ భారత సైనికులు దేశ భద్రత కోసం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారన్నారు. వారిని గౌరవించడమే కాదు, ఇటువంటి విపత్కర సమయాల్లో సాయంగా నిలవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. బాపట్ల జిల్లాకు చెందిన ఎన్‌ఆర్‌ఐ చూపిన ఉదారత అభినందనీయమన్నారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ దేశానికి సేవ చేయాలనే తపన వారి చర్యలో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఇలాంటి విరాళాలు అందించేవారు ఇతరులకు ప్రేరణగా నిలుస్తారని కొనియాడారు.

నృసింహునికి లక్ష పుష్పార్చన

మంగళగిరి టౌన్ : స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జయంత్యుత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఆలయ ముఖ మండపంపై నరసింహస్వామికి ఆలయ అర్చకులు లక్ష పుష్పార్చన భక్తుల సమక్షంలో కనులవిందుగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గులాబి, చేమంతి, బంతి, మల్లెలు, తులసీ దళాలతో పుష్పార్చన చేశారు. రాత్రి చతుర్వేద పారాయణ నిర్వహించారు. పుష్పార్చన వల్ల పాపాలు తొలగించి మంచి ఫలితాలు పొందవచ్చని అర్చకులు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.



పుష్పాలంకారంలో స్వామి

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,000** గరిష్ఠం : రూ. **5,500**

మోడల్ ధర రూ. **4,400**

క్లుప్తంగా

రేపటి నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: స్టూడెంట్ యూనియన్ ఆఫ్ నేషన్, కేవీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9, 10వ తరగతులతో పాటు ఇంటర్ విద్యార్థులకు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు బ్రాడీపేట 2/6లోని యూటీఎఫ్ కార్యాలయ సమావేశ మందిరంలో జరగనున్న శిక్షణ తరగతుల్లో భాగంగా సివిల్ సర్వీసెస్, ఐఏఎస్ పరీక్షలపై పాఠశాల స్థాయిలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. 10 రోజులపాటు నిపుణులు తరగతుల్లో బోధిస్తారని తెలిపారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి సర్వీసులకు ఎంపిక కావడం ద్వారా ప్రజలకు సేవలు అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 6309481514, 7995902645, 9494808589లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సీజీహెచ్ఎస్‌కు రేపు సెలవు

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు వైద్య సేవలు అందించే సీజీహెచ్ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం) వెల్‌నెస్ సెంటర్‌కు సోమవారం బుద్ధ పూర్ణిమ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిందని గుంటూరు సీజీహెచ్ఎస్ ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి తుకారాం శనివారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలోని కార్డు హోల్డర్లంతా వైద్య పరీక్షల నిమిత్తం సోమవారం గుంటూరుకు రావద్దని ఆయన సూచించారు.

'ఓడు'పోయిన మట్టి బతుకులు

- కడుపు నింపని చేతివృత్తి
- మృణ్మయ కళాకారుల జీవితం.. శ్రమకు దక్కని ఫలం
- మట్టికుండల చల్లదనం వెనుక శ్రామికుల స్వేదం
- కష్టాలను భరిస్తూ సంప్రదాయ చేతివృత్తిని కొనసాగిస్తున్న శాలివాహనులు

మట్టి పరిమళం వారికి జీవనశ్వాస...మట్టితో ముడిపడిన జీవితాలవి...తోటి మనుషులను నమ్మినా లేకున్నా మట్టిని ప్రేమిస్తారు. చేతివృత్తుల్లో ఒకటైన మట్టి పాత్రల తయారీలో 'కులవృత్తికి సాటిరాదు గువ్వలచెన్నా' అనుకుంటూ మమేకమైన దృశ్యం అక్కడ గోచరిస్తుంది. ఇంటిల్లిపాదికీ అది నిత్యం శ్రామిక జీవన సమరమే. వారు చిందించే స్వేదం నుంచే మట్టి కుండ రూపుదిద్దుకుని, అందులోని నీటి చల్లదనం దాహార్తులను సేదదీరుస్తుంది. మట్టికి అందమైన ఆకృతినివ్వగల ఆ మృణ్మయ కళాకారులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

SUNDAY SPECIAL

తెనాలి: గుంటూరు జిల్లాలో పది గ్రామాల్లో 350 పైగా కుటుంబాలు వంశపారంపర్యంగా వస్తున్న మట్టి పాత్రల తయారీలో దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. శలపాడు, గరువుపాలెం, కొలకలూరు, కావూరు, చింతాయపాలెం, మంగళగిరి, శృంగారపురం, తుమ్మలపాలెం, కొండవీడు, కోటప్పకొండ పరిసరాల్లో ఈ కుటుంబాలున్నాయి. పెళ్లి రోజున గరిక పాత్ర నుంచి పేదవాడి ఫ్రిజ్‌లుగా పిలుచుకునే కుండలు, కూజాలు, వంట పాత్రలు, పూలుకుండీలు, ప్రమిదెల సహా రకరకాల అవసరాల కోసం వాడే పాత్రల తయారీలో సిద్ధహస్తులు. ఏడాదిలో వేసవి కాలం మాత్రమే మట్టి పాత్రలకు గిరాకీ ఉంటుందని తెలిసిందే. మనిషి జీవితంలో ప్రవేశించిన ఆధునికత వీరి వృత్తికి కష్టకాలం తీసుకొచ్చింది. వేసవిలో అకాల వర్షాలు సంభవిస్తే వారి కష్టమంతా నీటి పాలవుతుంది. అన్నింటినీ భరిస్తూ కొనసాగిస్తున్న వారసత్వ చేతివృత్తిలో కళాత్మకత అబ్బురపరుస్తుంది.

దొరకని మట్టి

వృత్తికి ప్రధానమైన మట్టి లభ్యత సమస్యగా మారింది. ట్రక్కు రూ.5 వేలు పెట్టినా అనువైనది దొరకడం కష్టంగా ఉంది. వడ్లమూడి క్వారీ ఆపడంతో వీరికి నాణ్యమైన మట్టి కోసం పలుచోట్ల వెతుకులాట తప్పనిసరైంది. టన్ను పుల్లలు రూ.5 వేలు, పొలం పొట్టు రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.20 వేల వ్యయంతో ఏటా సంక్రాంతి తర్వాత జనవరి నెలాఖరులోపు అవసరమైనవి సమకూర్చుకుంటారు. ముందుగా మట్టిని ఎండబెట్టి, నలగ్గొట్టి, గాబులో పోసి వడపోసిన మట్టిని పాత్రల తయారీకి వినియోగిస్తారు. ఈ పనిలో ఇంటావిడ శ్రమిస్తే, మట్టిని అందమైన పాత్రలుగా మలచే పనిని ఇంటాయన చేస్తుంటారు.

ఇరుగుపొరుగు సాయంతో ఆము ఏర్పాటు

పదిహేను, ఇరవై రోజులు మట్టి పాత్రలు చేశాక వాటిని ఎండలో ఆరబెడతారు. తర్వాత ఒకరోజు ఇరుగుపొరుగు సాయంతో ఆము పెట్టుకుంటారు. సాయంత్రం పూట ఏడెనిమిది మంది కలిసి రెండు గంటలసేపు శ్రమిస్తే గాని ఆము తయారుకాదు. పగిలిన కుండలను చుట్టూ పేర్చుకుని, వాటిపైన ఆరబెట్టిన కుండలను భద్రంగా అమర్చుకుంటూ, అయిదారు వరుసలతో అన్నింటినీ సర్దుతారు. పగిలిన కుండపెంకులతో పైన కప్పును రూపుదిద్దుతారు. దిగువన కట్టెపుల్లలు, పొలం పొట్టు, ఊక ఏర్పాటు చేస్తారు. కాల్చిన పిడకలను చుట్టూ ఖాళీల్లో సర్దుతారు. ఆ పిడకలు రగులుకొని, ఊక, పొలం పొట్టుతో సహా కట్టెపుల్లలను మండించి, లోపలున్న మట్టిపాత్రలను ఎర్రగా కాలుస్తాయి.



ఆరబెట్టిన మట్టి కుండల కాల్పుకు ఆము ఏర్పాటు



విద్యుత్ మోటారు అమర్చిన సారెపై కుండ తయారీ

ఉదయాని కల్లా 'రెడీ టు సేల్'

మట్టి పాత్రల తయారీలో సంప్రదాయ విధానాలకు మృణ్మయ కళాకారులు కూడా ఆధునిక సాంకేతికతను అందుకున్నారు. పాత్రల తయారీ కోసం ముందుగా మట్టిని కలిపి పాకంగా చేయాలి. గతంలో ఇందుకోసం గంటన్నరపాటు కాళ్లతో తొక్కేవారు. ఇప్పుడు పది నిముషాల్లోనే విద్యుత్ మిషను మట్టి పాకాన్ని సిద్ధం చేస్తోంది. మరోవైపు చక్రం లాంటి సారెపై మట్టి ముద్ద తిరుగుతుంటే చేతితో అందమైన రూపంలో కుండను చేస్తారు. మధ్యమధ్యలో కర్రతో సారెను తిప్పుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు సారెను కర్రతో తిప్పే విధానానికి స్వస్తి పలికారు. విద్యుత్ మోటారుతో అవసరమైనంతసేపు తిరుగుతూనే వుంటోంది. దీనితో పాత్రల తయారీకి సమయం తగ్గింది. ప్రమిదెల తయారీకి సెరామిక్ బ్లాంకెట్ వాడుతున్నారు.

కుండలకు తగ్గిన గిరాకీ

ఎంత కళాత్మకంగా మట్టి పాత్రలు చేసినా మార్కెటింగ్‌లో నష్టపోతున్నామనే భావన వీరిలో ఉంది. అదేమంటే వినియోగదారులు 'మట్టి కుండేగా' అనేస్తున్నారని వృత్తిదారులు వాపోతున్నారు. మట్టి కుండ తయారీకి సగటున రూ.70-80 ఖర్చయితే, వీరి నుంచి రూ.120 కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో అదే కుండను రూ.250లకు అమ్ముతున్నారు. తయారీదారుకు రూ.50 లోపు మిగిలితే మధ్య వ్యాపారికి రూ.100 పైగా లభిస్తోంది. ఫ్రిజ్‌ల కారణంగా కుండలకు గిరాకీ తగ్గిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూలింగ్ క్యాన్లు వీరి వృత్తికి చేటు తెస్తున్నాయి. వేసవిలో విస్తృతంగా నడిచే చలివేంద్రాల్లో గతంలో కుండల స్థానంలో ఇప్పుడు కూలింగ్ వాటర్ క్యాన్లు వెలుస్తున్నాయి. ఈ క్యాన్ల నీటికన్నా కుండల నీరే శ్రేష్ఠమని తెలిసినా, అవే వాడుతున్నారు.

మట్టి పాత్రల తయారీలో మూడో తరం



కుండల తయారీలో మాది మూడోతరం. నేను 30 ఏళ్లుగా ఈ వృత్తిలో ఉన్నా. భార్య వెంకటరమణతో కలిసి వేసవి రోజుల్లో మట్టి పాత్రలను చేస్తుంటాను. ఇద్దరు కుమార్తెలు. పదోతరగతి వరకు చదివించి పెళ్లిళ్లు చేశాం. మా అల్లుళ్లు పాత్రలు చేయరు. మట్టి పాత్రల విక్రయం వ్యాపారంలో ఉన్నారు. మట్టి పాత్రల తయారీ గిట్టుబాటు కావడం లేదు. భవిష్యత్‌లో మా వారసులు ఈ వృత్తిలో ఉండరు.

– శాదరాజుపల్లి బోజిబాబు, వెంకటరమణ, గరువుపాలెం

గిట్టుబాటు కాని మార్కెట్ ధర



మట్టి పాత్రల వృత్తిలో నాది రెండోతరం. 30 ఏళ్లుగా కుండల తయారీలో ఉన్నాను. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. అమ్మాయిని ఇంటర్ వరకు చదివించి పెళ్లి చేశాను. అబ్బాయి డెయిరీలో పనిచేస్తున్నాడు. వృత్తిలో విద్యుత్ మిషన్లతో కొంత వెసులుబాటు వచ్చింది. ధర మాత్రం గిట్టుబాటు కావటం లేదు. మా ఇంటి నుంచి మూడో తరం ఈ వృత్తిలో లేనట్టే.

– బెజ్జంకి వీరభద్రరావు, గరువుపాలెం

టోల్‌గేట్ వద్ద టీడీపీ నాయకుడి డ్రైవర్ హల్‌చల్

- ఫీజు చెల్లించకుండా ఆటోల మార్గంలో వెళ్లేందుకు యత్నం
- అడ్డుకున్న సిబ్బందితో వాగ్వివాదం
- అటుగా వెళుతున్న తాడికొండ సీఐ సర్ది చెప్పినా వినకుండా ఆగ్రహం
- సీఐకి ఫోన్ చేసి బెదిరించిన టీడీపీ నాయకుడు కొమ్మినేని

మంగళగిరి: నగర పరిధిలోని కాజ టోల్ గేట్ వద్ద టీడీపీ నాయకుడు డ్రైవర్, కుమారుడు హల్‌చల్ చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. టీడీపీ నాయకుడు కొమ్మినేని సాంబశివరావు కుమారుడు డ్రైవర్‌తో కలిసి విజయవాడ నుంచి టోల్ గేట్ మీదుగా ఫీజు చెల్లించకుండా ఆటోల మార్గంలో వెళ్లేందుకు ప్రయత్నించాడు. దీంతో సిబ్బంది అడ్డుకున్నారు. తాను టీడీపీ నాయకుడి డ్రైవర్‌నని, కారులో ఆయన కుమారుడు ఉన్నాడని, టోల్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదంటూ సిబ్బందితో వాగ్వివాదానికి దిగాడు. కారును ఆటోలు వెళ్లే మార్గంలో అడ్డుగా నిలిపి, మేనేజర్ మధుకిరణ్‌కి ఫోన్ చేశాడు. ఆయన సెలవులో ఉన్నానని చెప్పడంతో మరింత ఆగ్రహం వ్యక్తం చేశాడు. విషయాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణకుమార్‌కు ఫిర్యాదు చేస్తానంటూ డ్రైవర్ బెదిరింపులకు దిగాడు. అయినా సిబ్బంది వినకపోవడంతో కారు అడ్డు తీయకుండా అటుగా వెళ్లే వాహనదారులను ఇబ్బంది పెట్టాడు. దీంతో అర కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. అదే సమయంలో అటుగా వెళుతున్న తాడికొండ సీఐ వాసు ట్రాఫిక్ ఆగిపోవడం చూశారు. ముందు కారును అడ్డుతీసి పక్కన పెట్టి మాట్లాడుకోవాలని, వాహనదారులను ఇబ్బంది పెట్టవద్దని ఆయన కోరారు. దీంతో టీడీపీ నాయకుడు కొమ్మినేని సాంబశివరావుకు డ్రైవర్ తెలియజేశాడు. ఆయన సీఐకి ఫోన్ చేసి తన కారునే ఆపుతారా.. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు, ఎమ్మెల్యే శ్రావణ కుమార్‌కు ఫిర్యాదు చేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. సుమారు అరగంట పాటు కారు అడ్డు తీయకుండా వాహనదారులను ఇబ్బంది పెడుతుండడంతో సీఐ తీయించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

రేపు పల్నాడు జిల్లా రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు

అచ్చంపేట(క్రోసూరు): పల్నాడు జిల్లాస్థాయి రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు సోమవారం అచ్చంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జరుగుతాయని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం శనివారం తెలిపారు. ఎంపికల గురించి వివరిస్తూ .. అండర్-17 విభాగంలో బాలుర, బాలికల ఎంపికలు జరుగుతాయని వారు 2008, 2009, 2010 సంవత్సరాలలో పుట్టిన వారై ఉండాలన్నారు. 2010లో పుట్టినవారు మెడికల్ సర్టిఫికెట్, పేరంటల్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. అండర్-23 విభాగంలో పురుషులు, స్త్రీల ఎంపిక జరుగుతుందన్నారు. వీరు 2002 నుంచి 2006 సంవత్సరాలలో పుట్టి ఉండాలన్నారు. 2006లో పుట్టినవారు మెడికల్ సర్టిఫికెట్, పేరంటల్స్ సర్టిఫికెట్ అందజేయాలని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనదలచినవారు ఈనెల 12 ఉదయం 10 గంటలకు గురుకుల కళాశాలలో ఆధార్ జిరాక్స్ కాపీ, ఒరిజనల్ కార్డు, మెడికల్, పేరంటల్ సర్టిఫికెట్లు తీసుకొని రావాలన్నారు. ఎంపికైన వారు ఈనెల 16,17,18 తేదీల్లో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకే పల్లెనిద్ర

రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు

రేపల్లె: శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రజలతో మమేకమై పనిచేసేందుకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు చెప్పారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి పట్టణంలోని 18వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వార్డులో ఎటువంటి సమస్యలు తలెత్తినా శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. వివాదాస్పద సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వార్డులో అనుమానాస్పద స్థితిలో ఎవరైనా కొత్త వ్యక్తుల సంచారం ఉంటే పోలీసులకు తెలపాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకుంటే తప్పనిసరిగా పోలీసులకు తెలియజేయాలన్నారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు, పోక్సో కేసుల వివరాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 11 జీవాలు మృతి



బొల్లాపల్లి: పిడుగుపాటుకు గుర్రై గొర్రెలు, మేకలు మృతిచెందిన సంఘటన మండలంలోని గుమ్మనంపాడు గ్రామ పొలాల్లో శనివారం జరిగింది. గ్రామానికి ఆళ్లగండి చెరువు వీరనాయకులు గుడి వద్ద ఈదురుగాలులతో కూడిన వర్షంలో పిడుగు పడటంతో గొర్రెలు, మేకలు 11 మృత్యువాతకు గురయ్యాయి. గ్రామానికి చెందిన గోపీనాయక్, కె.నాగయ్యలతో పాటు మరికొందరు రైతులకు చెందిన 11 జీవాలు మృతిచెందాయి. వీటివిలువ సుమారు రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఉంటుందని బాధితులు చెప్పారు. ఘటనా ప్రాంతాన్ని గుమ్మనంపాడు పశు వైద్యుడు బి.సాల్మన్‌సింగ్ పరిశీలించారు.

కులరహిత సమాజమే సర్వ శ్రేయోదాయకం

ప్రజాకవి జయరాజ్

గుంటూరు ఎడ్యుకేషన్: కులరహిత సమాజమే సర్వ శ్రేయోదాయకమని ప్రజాకవి జయరాజ్ పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ కుల రహిత సమాజం (ఏసీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం బ్రాడీపేటలోని లూథరన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూలు ఆవరణలో 'భారత రాజ్యాంగం సాధించిన ప్రగతి.. అమలు తీరు', 'బహుజన వారియర్స్ జీవిత చరిత్రలు', 'భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచనలు, ప్రసంగాలు' (17 సంపుటాలు) అంశాలపై ఓఎంఆర్ షీట్స్ ద్వారా వెయ్యి మంది పైగా విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. తొలుత గౌతమ బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసిన అనంతరం ఏఎన్‌యూలో విద్యనభ్యసిస్తున్న మయన్మార్ బౌద్ధ భిక్షువులు ప్రార్థన చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కవి జయరాజ్ మాట్లాడుతూ 500 ఏళ్ల కిందట దేశంలో నెలకొన్న సామాజిక అసమానతలు, కుల వివక్షతపై గౌతమ బుద్ధుడు తన బోధనలతో తిరుగుబాటు చేశారని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనల ఉద్యమ స్ఫూర్తితో విద్యార్థులు, యువతరం నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బుద్ధిస్ట్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ ముందస్తు బుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆయన జీవితం, నైతికత, ఆలోచన, బోధనలు తూచా తప్పక ఆచరించిన జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువతరానికి ఆదర్శమన్నారు. బౌద్ధ విజ్ఞానం విశ్వజనీయమైనదని, అష్టాంగ మార్గం ద్వారా మానవుడు ఎలా జీవించాలో బోధించారని తెలిపారు. డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ బౌద్ధం నిజమైన తార్కిక ధోరణి అయితే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం భారత జాతి ఆత్మ, గుండె చప్పుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీపీ మండల్ మహాసేన ప్రతినిధి డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, ఏ.గవర్రాజు, కేకే బోధి, డి.రత్న ప్రదీప్, దేవరకొండ వెంకటేశ్వర్లు, అబ్రహం లింకన్, విశ్రాంత డీఎస్పీ పి.రవికుమార్, ఏసీఎఫ్ రాష్ట్ర మహిళా కన్వీనర్ రజిని, అల్లాడి దేవకుమార్, జి.ఆర్. భగత్ సింగ్, హేబేలు, నీలాంబరం, పి.వెంకటేశ్వర్లు, పలువురు బుద్ధిస్టులు, అంబేద్కరిస్టులు, బహుజన మేధావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయరాజ్

సీపెట్‌లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని కేంద్ర పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో టెన్త్ విద్యార్హతతో మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సీహెచ్. శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ విద్యార్హతతో రెండేళ్ల వ్యవధి గల పీజీ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ) కోర్సులో ప్రవేశాలకు సైతం htt pr://cipet25.oninerefirtrationgorm.orf/CIPET/ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత కోర్సులకు ప్రభుత్వం నుంచి ఫీజు రీ-యింబర్స్‌మెంట్ సదుపాయం ఉందని, జూన్ 8న జరగనున్న సీపెట్ అడ్మిన్ టెస్టులో వచ్చిన ర్యాంకు ఆధారంగా విజయవాడ కేంద్రంలో గల 150 సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. ఆయా కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు ప్లాస్టిక్ రంగంలోని బహుళజాతి, అనుబంధ సంస్థల్లో జూనియర్ ఇంజినీర్ (ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్ అండ్ మేకర్, జూనియర్ ఇంజినీర్ (మెయింటెనెన్స్), క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో ఇన్‌స్పెక్టర్ వంటి ఉద్యోగావకాశాలు నెలకు రూ.20 వేల నుంచి వేతనంతో ఉంటాయని పేర్కొన్నారు. సాధారణ విద్యార్థులు సైతం మెరుగైన ప్రతిభ కనబర్చగలరని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తుతో పాటు ఇతర వివరాలకు 78935 86494 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నాయక్.. నీ త్యాగం మరువలేనిది !

లక్ష్మీపురం: పాకిస్థాన్‌తో పోరాడే క్రమంలో తెలుగు బిడ్డ మురళీనాయక్ ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని, ఆ వీర సైనికుని త్యాగాన్ని భరత జాతి ఎన్నటికీ మరచిపోదని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యావేత్త ఆర్.వి సింగరయ్య పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో వీర జవాన్ మురళీ నాయక్‌కు శనివారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల వయస్సులో మాతృభూమి కోసం ప్రాణాలర్పించి అమరుడైన మురళీ నాయక్ త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుందని కొనియాడారు. మురళీ నాయక్ చూపిన ధైర్యసాహసాలు రాష్ట్రానికి గర్వకారణమని, యువ జవాన్ పేరు చరిత్ర పుటల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఇంజినీర్ ఎస్.సదాశివం, అవగాహన సంస్థ సాంస్కృతిక కార్యక్రమాల కో-ఆర్డినేటర్ బిళ్లా అశోక్, సంస్థ సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

మద్యం తాగిన వ్యక్తి మృతి

మార్టూరు: మద్యం సేవించి అపస్మారక స్థితిలోకి చేరుకున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మార్టూరులో శనివారం జరిగింది. స్థానిక నాగరాజు పల్లి రోడ్డులో గల వైన్స్ షాపు వద్ద మార్టూరు రాంనగర్ కాలనీకి చెందిన మొదపాటి దానియేలు (35) మధ్యాహ్నం వెళ్లి మద్యం సేవించి షాపు సమీపంలో బండపై పడుకున్నాడు. మద్యం మత్తులో దాహంతో గొంతు ఎండిపోయిన అతడు ఉలుకూ, పలుకు లేకుండా అపస్మారక స్థితిలో ఉండిపోయాడు. మొదట గుర్తు తెలియని వ్యక్తిగా భావించిన స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దానియేలును పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించిన ఆసుపత్రి సిబ్బంది అతని బంధువులకు సమాచారం అందించారు. దానియేలుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.